క్లుప్తంగా

కొనుగోళ్లు ఎప్పుడో..?



చిలప్‌చెడ్‌లో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న ధాన్యం రాశులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా.. కొనుగోళ్లు మాత్రం జరగడం లేదు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి చేతులమీదుగా కేంద్రాలు ప్రాంభించినప్పటికీ ధాన్యం తూకం వేయడం లేదు. ఓ వైపు ధాన్యం కేంద్రాల వద్ద ఉంచిన ధాన్యం కొనుగోళ్లు జరగక, కురుస్తున్న వర్షాలతో రైతులు సతమతమవుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు మరింత ఆలస్యమైతే దళారులకు విక్రయించే పరిస్థితి ఉందని, నిర్వాహకులు కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అంగన్‌వాడీలో కుళ్లినగుడ్లు



గజగట్లపల్లిలో అందించిన కుళ్లిన కోడిగుడ్లు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గజగట్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు గర్భిణులకు కుళ్లిపోయిన కోడిగుడ్లను అందిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి కుళ్లిన కోడిగుడ్లను అందించడంపై నిలదీశారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గుడ్లను అందిస్తుండగా, అంగన్‌వాడీ నిర్వాహకులు నిర్లక్ష్యంతో తమ ఇష్టానుసారం వ్యవహిస్తున్నారన్నారు. కుళ్లిన కోడిగుడ్లను తింటే అనారోగ్యం పాలైతే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రం టీచర్ సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతోనే కుళ్లిన గుడ్లను అందిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే ఐసీడీఎస్ అధికారులు విచారించి చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న పంజా విజయకుమార్

రామాయంపేట(మెదక్): ప్రజాసమస్యల విషయమై ఉద్యమిస్తామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయకుమార్ అన్నారు. శనివారం రామాయంపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ సభ్యత్వం సేకరణ వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించాలని ఆయన సూచించారు. పార్టీ నాయకులు శంకర్‌గౌడ్, కొడపర్తి నరేందర్ చారి, కార్తీక్, ఎల్లం, దిలీప్ పాల్గొన్నారు.

చార్జీల పెంపుపై హర్షం



చార్జీల బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వం హాస్టల్, గురుకుల విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచడంతో ఎస్టీ గురుకుల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫణికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచడంతో మరింత నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం అందుతుందని చెప్పారు. ప్రభుత్వం పెంచిన మెస్, కాస్మొటిక్ చార్జీల వివరాలను బ్యానర్ ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భవాని, ఉపాధ్యాయులు మంజుల, రజిత, డా. శ్రీనివాస్, ధర్మరాజు, ప్రవంతి, రవి, రమేష్, రామకృష్ణ, నరేష్, రహీం తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి కల్యాణం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

చాకరిమెట్లలో భక్తుల సందడి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దేవాదత్త శర్మ, ప్రభుశర్మ తదితరులు ఉన్నారు.

సబ్సిడీ టార్పాలిన్లు అందేనా..?

● ఇబ్బందులు పడుతున్న రైతులు



తీన్ నంబర్ తండా గేటువద్ద అద్దెకు ఉంచిన టార్పాలిన్లు

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు ఇవ్వడంలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతూ.. అద్దె కోసం రూ. వేలు ఖర్చుపెడుతున్నారు. కోతల సమయంలో ధాన్యాన్ని అరబెట్టేందుకు, వర్షాల భారీ నుంచి కాపాడు కోవడానికి అవస్థలు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో రైతులు అద్దెకు టార్పాలిన్లు తెచ్చు కుంటున్నారు. గత ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై ఐదారేళ్ల క్రితం ఎనిమిది ఫీట్ల పొడవు, ఆరు ఫీట్ల వెడల్పుతో మందం ఉన్న టార్పాలిన్ల ధర మార్కెట్‌లో రూ. 25 వందల వరకు ఉండగా, వ్యవసాయశాఖ తరఫున వాటిని రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందజేసింది. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ఎంతో సౌలభ్యంగా ఉండేది. వాటి సరఫరా నిలిచి పోవడంతో తాము రూ. వేలు ఖర్చుచేసి అద్దెకు తీసుకుంటూ నష్టపోతున్నామని వారు వాపోయారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో టార్పాలిన్లు లేక కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. రైతులు తమ ధాన్యాన్ని అరబెట్టుకోవడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసి, వాటిని కాంటా వేసే వరకు కనీసం 20 రోజుల సమయం పడుతుంది. తమకు రూ. రెండు నుంచి మూడు వేల వరకు టార్పాలిన్లపై అద్దె చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ మేరకు మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో సైతం టార్పాలిన్లు అద్దెకు లభిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై తమకు టార్పాలిన్లు అందజేయాలని వారు విజ్ఞప్తి చేశారు.



ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లు

సబ్సిడీపై ఇవ్వాలి



టార్పాలిన్లు అద్దెకు తెచ్చుకొని రూ. రెండున్నర వేల నుంచి రూ.మూడు వేల వరకు అదనపు భారం పడుతోంది. ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు ఇస్తే మాకు అనువుగా ఉంటుంది.

– కిషన్, రైతు, కోనాపూర్

సరఫరా కావడంలేదు



ఐదారేళ్లుగా ప్రభుత్వం నుంచి సబ్సిడీపై టార్పాలిన్లు సరఫరా కావడంలేదు. దీంతో రైతులకు అందించలేకపోతున్నాం. ప్రభుత్వం నుంచి వస్తే రైతులకు అందజేస్తాం.

– గోవిందు, జిల్లా వ్యవసాయ అధికారి

షిఫ్టింగ్ పద్ధతిలో ఇంటర్, డిగ్రీ తరగతులు

● వద్దంటున్న ఇంటర్ విద్యార్థులు



కౌడిపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలో డిగ్రీ కళాశాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయకపోవడంతో ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే షిఫ్టింగ్ పద్ధతిలో డిగ్రీ కళాశాల కొనసాగేలా అనుమతులు డిగ్రీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. దామోదర్ అన్నారు. దీంతో జూనియర్ కళాశాల విద్యార్థులు షిఫ్టింగ్ పద్ధతిలో వద్దంటున్నారు. గత ఏడాది కౌడిపల్లికి డిగ్రీ కళాశాల మంజూరైంది. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంతో నర్సాపూర్ చింతకుంటవద్ద గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగించారు. ఈ సంవత్సరంలో వివిధ గ్రూపుల్లో 54 విద్యార్థులుండగా, ఏడుగురు గెస్ట్ లెక్చరర్లు నియామకమయ్యారు. ప్రస్తుతం ఉన్న జూనియర్ కళాశాలలోనే డిగ్రీ సైతం ఏర్పాటు చేసి షిఫ్ట్ పద్ధతిలో కొనసాగించాలని కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉదయం జూనియర్, మధ్యాహ్నం డిగ్రీ

షిఫ్ట్ పద్ధతిలో కొనసాగితే ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జూనియర్ కళాశాల, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు డిగ్రీ కళాశాల కొనసాగనుంది. ఇక్కడ చదివేది గ్రామీణ వ్యవసాయ, కూలీల పిల్లలే. ఉదయం ఇంటి వద్ద పనులు చేసుకొని కళాశాలకు రావాల్సి ఉంటుందని అనరు. షిఫ్ట్ పద్ధతిలో కళాశాల కొనసాగితే సమయానికి రాలేకపోతామని వాపోయారు.

షిఫ్ట్ పద్ధతిలో వద్దు

షిఫ్టింగ్ పద్ధతిలో జూనియర్, డిగ్రీ కళాశాల కొనసాగితే ఇబ్బందులుంటాయి. ఉదయం ఇంటివద్ద పనులు చేసుకొని కళాశాలకు వచ్చేవారు ఎక్కువగా ఉన్నాం. ఉదయం అంత తొందరగా కళాశాలకు రాలేక తరగతులు మిస్ అవుతాం. అధికారులు స్పందించి యథావిధిగా క్లాసులు కొనసాగించాలి.

– దినేష్‌కార్తిక్, సీఈసీ విద్యార్థి

కోర్టు కేసు ఉంటే పోలీసుల జోక్యం సరికాదు

కొల్చారం(నర్సాపూర్): కోర్టు కేసు ఉన్న భూవ్యవహారంలో పోలీసులు జోక్యం చేసుకోవడం సరికాదని, బాధితుడికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని రంగంపేటలో భూ బాధితులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంగంపేట గ్రామానికి చెందిన వంజరి నర్సింగరావు సర్వే నంబర్ 205లో 1978వ సంవత్సరంలో 35 గుంటల భూమి కొనుగోలు చేశాడు. అందులో రైస్‌మిల్ నిర్మాణానికి 20 గుంటల భూమిని నాలా కన్వెన్షన్ చేసి, సుమారు 20 ఏళ్ల క్రితమే రైస్‌మిల్ నిర్మించి నడుపుతున్నాడు. మూడు నెలలుగా అతనికి భూమి అమ్మిన వ్యక్తి వారసులు వచ్చి ఆ స్థలంలో మాకు భూమి వస్తుందంటూ, రైస్‌మిల్లు నడవకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. దీంతో మిల్లు యజమాని రెవెన్యూ, పోలీసు, అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తానని బాధితుడు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి



కొల్చారం(నర్సాపూర్): వర్షాలకు మొలకెత్తిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



చిన్నశంకరంపేట(మెదక్): గవ్వలపల్లిలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నేతలు

కొల్చారం(నర్సాపూర్): ధాన్యాన్ని వెంటనే కొనుగోలు ప్రారంభించాలని లేదంటే రైతుల పక్షాన ఆందోళన చేపడతామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం మండలంలోని వరిగుంతం,వసురం తండా గ్రామపంచాయతీ పరిధిలోని వర్షానికి తడిసిన వరి ధాన్యం కల్లాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మొలకెత్తిన ధాన్యాన్ని ఎమ్మెల్యేకు చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లకు రైస్ మిల్లర్లు ముందుకు రాకపోవడం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోడౌన్లలో పెట్టాలని జిల్లా అధికారులు చెబుతున్నారన్నారు. అధికారులు రైస్ మిల్లర్లతో వెంటనే చర్చలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్షానికి తడిసిన ధాన్యాన్ని, మొలకెత్తిన ధాన్యాన్ని ఎలాంటి నిబంధనలు పెట్టకుండా బేసరత్తుగా కొనుగోలు చేయాలని లేదంటే ఆందోళన చేపడుతామన్నారు. ఎమ్మెల్యే వెంటా తాజా మాజీ జెడ్పీటీసీ మేఘమాల, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ కుమార్, శ్రీనివాస్ నాయక్ తదితరులు ఉన్నారు.

దళారులతో కుమ్మక్కయిన ప్రభుత్వం

రామాయంపేట(మెదక్): దళారులతో కుమ్మక్కయిన ప్రభుత్వం ఇంకా గ్రామాల్లో ధాన్యాన్ని కొనుగోళ్లు చేయడం లేదని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారని వాపోయారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులు ఎంతమాత్రం పట్టించుకోడంలేదని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకాలు ప్రారంభించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం మొద్దు నిద్రను వీడాలి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వం మొద్దునిద్రను వీడి, వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించకపోతే రైతులతో కలిసి రోడ్డెక్కుతామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు హెచ్చరించారు. శనివారం మండలంలోని గవ్వలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన దాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తడిసి మెలకెత్తి నష్టపోతున్నా.. ప్రభుత్వం కాంటా చేయడంలేదని రైతులు తెలిపారు. ఇరవై రోజులుగా ధాన్యం తడుస్తున్నా.. కొనుగోలు చేయకపోవడంతో ఇప్పటికే అనేక మంది రైతులు దళారులకు విక్రయించి నష్టపోయరన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల వద్ద కొబ్బరికాయులు కొట్టి ఫొటోలకు ఫోజులు ఇచ్చారు తప్పితే ఇప్పటికి గింజా ధాన్యం కూడా కాంటాచేయలేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు నిర్వహించకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కందరి శ్రీను, గౌండస్వామి, భాగారెడ్డి, రాజ్ కుమార్, ఉదయ్, నరేష్, వెంకట్‌గౌడ్, అజయ్, సురేష్, మోమస్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరించడంలో ప్రభుత్వం విఫలం

శివ్వంపేట(నర్సాపూర్): రైతుల నుంచి ధాన్యం సేకరించడంలో ప్రభుత్వం విఫలమైందని నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం రైతులు కల్లాల్లో నిల్వచేస్తే.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి అవలంభిస్తుందని ఆరోపించారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తక్కువ ధరకు ధాన్యం దళారులకు విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ **విధుల కేటాయింపులో వివక్ష**

వెల్దుర్తి(తూప్రాన్): కుల గణనకు నిధుల కేటాయింపులు వివక్షపూరితమని, ప్రతీ ఉపాధ్యాయుడికి కుల గణన విధులు కేటాయించాలని రాష్ట్ర ఎస్టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని సమావేశంలో రాష్ట్ర ఎస్టీటీయూ ప్రధాన కార్యదర్శి వెంకటేశంతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణ విధులను పీఎస్ టీచర్లతో పాటు, యూపీఎస్, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికీ విధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన నెరోల్ల శంకర్ కూతురు నిత్యశ్రీ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో చిన్నారి వైద్య ఖర్చుల కోసం రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, మాజీ ఎంపీపీ అరుణప్రభాకర్, శేరిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

◆ **నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

మనోహరాబాద్(తూప్రాన్): పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతుండటంతో విద్యుత్ ప్రసారంలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ కృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం 220 33 కేవీ పనుల్లో భాగంగా చెట్లగౌరారం, మినాజీపేట్ లైన్ విద్యుత్ మరమ్మత్ పనులు చేపడుతున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయబడుతుందన్నారు. దీంతో చెట్లగౌరారం, కోనాయపల్లి, రంగాయపల్లి, ధర్మరాజ్‌పల్లి, వెంకటాపూర్ అగ్రహారం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ **సన్మానం**

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ప్రజాసంఘాల సభ్యులు శనివారం మెదక్ మున్సిపల్ కమిషనర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బాల్‌రాజ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు**

చిన్నశంకరంపేట(మెదక్): ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ తెలిపారు. శనివారం మెదక్ ఆర్టీసీ డిపో డ్రైవర్ మలోల్ లాలు స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లేందుకు నార్సింగి వచ్చాడు. బస్‌ను యూ టర్న్ తీసుకుంటున్న సమయంలో రోడ్డుపై అడ్డంగా పల్సర్ బైక్‌పై కాస్లాపైర్‌కు చెందిన స్వామి ఉన్నాడు. దీంతో డ్రైవర్ హారన్ చేశాడు. దీంతో కోపానికి గురైన స్వామి డ్రైవర్‌ను చేయి చేసుకున్నాడు. దీంతో డ్రైవర్ ఫిర్యాదుతో నార్సింగి ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

నర్సాపూర్ రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నక్క రఘుపతి (32) కడుపునొప్పి భరించలేక అక్టోబర్ 30న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చికిత్స కోసం నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో అదే రోజు మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొమురయ్య మృతిపై విచారణ జరపాలి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

నర్సాపూర్ రూరల్: ట్రాక్టర్ కల్టివేటర్‌లో ఇరుక్కొని అనుమానాస్పదంగా మృతి చెందిన కొమురయ్య మృతిపై అన్ని కోణాల్లో విచారణ జరపాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పోలీసులను కోరారు. శనివారం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి గదిలో ఉన్న కొమురయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని బడంపేట గ్రామానికి చెందిన కొమురయ్య (40) అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్ కల్టివేటర్ ఇరుక్కొని మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆయన మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేసి, వివరాలను వెల్లడించాలని పోలీసులను కోరారు. బీజేపీ బూత్ స్థాయి అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తి అని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపీ వెంబడి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, రమణారావు, మల్లేశ్‌గౌడ్, కౌన్సిలర్లు సంఘసాని సురేష్, బుచేష్ యాదవ్, ఎరుకల యాదగిరి, పట్టణాధ్యక్షుడు అంజిగౌడ్, అరవింద్ గౌడ్ తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి : శ్రీనివాస్



జేసీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మెదక్‌జోన్: ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించక పోవటంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద నానా తంటాలు పడుతున్నారని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మెదక్ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతి ఏటా మద్దతు ధరను పెంచి ధాన్యాన్ని సంబంధించిన డబ్బులను కేంద్రమే ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై రైతులను ఇబ్బందులు గురుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

● ఎంఈఓ తారాసింగ్



మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నరేశ్

నర్సాపూర్ రూరల్: డ్రగ్స్ నిర్మూలనపై ప్రతీ విద్యార్థికి అవగాహన అవసరమని ఎంఈఓ తారాసింగ్ అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలల ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాక్లెట్లు, కేకులు, ఇతర రూపాల్లో విద్యార్థులకు స్మగ్లర్లు డ్రగ్స్ అలవాటు చేసేందుకు పూనుకున్నారని అన్నారు. ప్రతీ విద్యార్థి డ్రగ్స్, మత్తు, పొగకు దూరముండాలని సూచించారు. డ్రగ్స్ వాడకం, అమ్మకం వంటి విషయాలు దృష్టికి వస్తే వెంటనే 1908 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకిషన్, సామ్యా నాయక్, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దొంగ స్వాములను నమ్మొద్దు

విద్యార్థులు దొంగ స్వాములను నమ్మొద్దని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ అన్నారు. శనివారం మండలంలోని చిప్పల్‌తుర్తి కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు మూఢనమ్మకాలు, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మాంత్రికులు, భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షోల ద్వారా వాటి వెనుక ఉన్న రహస్యాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, యేసయ్య, కృష్ణ, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది మోహన్, గోపాల్, ప్రణతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలి



తునికి ఎంజేపీ గురుకులంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రంజిత్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలని, మూఢ నమ్మకాలను నమ్మొద్దని ఎస్ఐ రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తునికి వద్ద గల ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఎస్పీ ఆదేశాలతో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, సైన్స్, మూఢనమ్మకాల నిర్మూలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిందని దొంగబాబాలు, భూతవైద్యులను నమ్మొద్దని చెప్పారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుతోనే అభివృద్ధి చెందుతామని, శ్రద్ధగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యులు నరేష్, ప్రిన్సిపాల్ హరిబాబు, ఏటీపీ బాబు, డిప్యూటీ వార్డెన్ లక్ష్మణ్, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం

నర్సాపూర్ రూరల్: ఉచిత వైద్య శిబిరాలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు వరం లాంటిదని పెద్ద చింతకుంట మాజీ సర్పంచ్ శివకుమార్ అన్నారు. మండలంలోని పెద్ద చింతకుంటలో శనివారం హైదరాబాద్ నారాయణ మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో నివసించే పేద, మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో అనేకమందికి నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్‌తో పాటు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మనస్వీ, శ్రీజ, గ్రామస్తులు దశరథ, గౌరయ్య, యాదయ్య, నరసింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.